PS NEWS

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక



మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 27-08-2025 | సంపుటి - 24 | సంచిక - 110 | రూ : 4 | పేజీలు: 8




## ఓటర్ అధికార్ యాత్రలో సీఎం రేవంత్‌రెడ్డి

- బిహార్‌లో రాహుల్, ప్రియాంకలతో కలిసి ర్యాలీ



2లో

## క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం..

### ఇక మనమే గ్లోబల్ హబ్: ప్రధాని మోదీ



2లో

- అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తికి శ్రీకారం
- 100 దేశాలకు 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం
- క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో భారత్ ప్రపంచ హబ్‌గా మారుతుందన్న ప్రధాని
- భారత్‌లో బ్యాటరీల తయారీ కోసం మూడు జపాన్ కంపెనీల భాగస్వామ్యం
- పెట్టుబడుల కోసం రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని మోదీ పిలుపు
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలపై ఇకపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్న ప్రధాని




## ట్రంప్ గొంతెమ్మ కోరికలు... భారత రైతులకు సవాళ్లు!

2లో



2లో

## రొటీన్ సమావేశాలు వద్దు.. ప్రజల కోసం పనిచేయండి

- బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- బ్యాంకర్ల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి
- సీజన్ చివర్లో రైతులకు రుణాలిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్న
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హితవు




2లో

## ఏటీఎంలపై బ్యాంకులకు ఆర్బీఐ కీలక ఆదేశాలు

- ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్లు తప్పనిసరి
- బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లకు ఆర్‌బీఐ ఆదేశాలు
- సెప్టెంబర్ 30 లోపు అమలు చేయాలన్న ఆర్బీఐ

## తెలంగాణకు హెచ్చరిక

నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు



2లో

- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం
- నేడు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- రేపు ఏడు జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరికల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు

## 30 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

### 'కాళేశ్వరం' నివేదికపై చర్చ!

- సభ ముందుకు జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ కాళేశ్వరం నివేదిక
- ఐదు రోజుల పాటు సమావేశాలు జరిగే అవకాశం
- అసెంబ్లీలో చర్చించాకే కాళేశ్వరం అవకతవకలపై చర్యలని కోర్టుకు స్పష్టం చేసిన ప్రభుత్వం

2లో






2లో

## సముద్రంలో శత్రువులకు చెక్..

- నౌకాదళంలోకి రెండు స్వదేశీ యుద్ధనౌకలు

# క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం.. ఇక మనమే గ్లోబల్ హబ్: ప్రధాని మోదీ

**ఢిల్లీ, ఆగష్టు 26 :** ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గతంలో ఈవీలకు అత్యంత కీలకమైన బ్యాటరీలను మనం పూర్తిగా దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. మూడు ప్రముఖ జపాన్ కంపెనీలు కలిసి భారత్‌లోనే బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రోడ్‌లను తయారు చేస్తున్నాయి. ఇది మన దేశ హైబ్రిడ్ వాహనాల మార్కెట్‌కు కొత్త ఊపునిస్తుంది" అని ఆయన వివరించారు. భారత్‌జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. "వ్యాపార అనుకూల వాతావరణం, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పెట్టుబడులకు అనువైన మార్గాలను సృష్టించాం. ఫలితంగా పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగింది" అని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "మేం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం" అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## రొటీన్ సమావేశాలు వద్దు.. ప్రజల కోసం పనిచేయండి

**అమరావతి, ఆగష్టు 26:** కేవలం సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని...బ్యాంకులు తమ నిర్ణయాలను ప్రజలు, రైతులు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో మాట్లాడుతూ, బ్యాంకర్లు తమ పనితీరును మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే సగం కాలం గడిచిపోయిందని, ఈ సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు సీజన్ చివరిలో రుణాలు మంజూరు చేస్తే ప్రయోజనం ఉండదని చంద్రబాబు అన్నారు. "రైతులకు అవసరమైనప్పుడు రుణాలు, ఇతర ఇన్‌పుట్‌లు అందించాలి. కాలం దాటిపోయాక ఇచ్చే రుణాలతో వారికి ఉపయోగం శూన్యం" అని ఆయన చెప్పారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకులు కూడా కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని, నూతన సంస్కరణలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా వంటి దేశాలకు సవాలు విసిరేలా ఎదుగుతోందని, ఈ అభివృద్ధిలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. సంపద సృష్టితో పాటు పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. 2047 నాటికి భారత్‌ను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాలన్న లక్ష్యంలో భాగంగా బ్యాంకులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యం కాగా, జూన్ నాటికి రూ.94,666 కోట్లు మంజూరు చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. వీటితో పాటు విద్యా రంగానికి రూ.252 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

## 30 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

**హైదరాబాద్, ఆగష్టు 26 :** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెల 30 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుంది. దాదాపు ఐదు రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సమావేశాల్లో కాళేశ్వరం నివేదికపైనే ప్రధానంగా చర్చ జరగనుండటంతో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది. అయితే, ఈ నివేదికను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. విచారణ సందర్భంగా, అసెంబ్లీలో నివేదికపై చర్చ జరిపిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ప్రభుత్వం తరఫున కోర్టుకు స్పష్టం చేశారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఒకవేళ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించింది. పూర్తి వివరాలతో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఐదు వారాలకు వాయిదా వేసింది.

## ఏటీఎంలపై బ్యాంకులకు ఆర్బీఐ కీలక ఆదేశాలు

**ఢిల్లీ, ఆగష్టు 26 :** ఏటీఎంలలో రూ. 100, రూ. 200 నోట్లు దొరక్క ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా అన్ని ఏటీఎంలలో ఈ డినామినేషన్ నోట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని బ్యాంకులకు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎదుర్కొంటున్న చిల్లర కష్టాలకు త్వరలోనే తెరపడనుంది. ఈ సమస్య కారణంగా చాలామంది చిన్న లావాదేవీలకు కూడా యూపీఐ చెల్లింపులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది చిరు వ్యాపారులు, సాధారణ ప్రజలపై ప్రభావం చూపుతోందని గుర్తించిన ఆర్‌బీఐ, ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఈ ఆదేశాల ప్రకారం, ప్రతి ఏటీఎంలో కనీసం ఒక క్యాసెట్‌ను రూ. 100 లేదా రూ. 200 నోట్ల కోసం కేటాయించాలి. ఇందుకు అనుగుణంగా దశలవారీగా మార్పులు చేయాలని బ్యాంకులకు స్పష్టమైన గడువు విధించింది. సెప్టెంబర్ 30 నాటికి దేశంలోని 75 శాతం ఏటీఎంలు, 2026 మార్చి 31 నాటికి 90 శాతం ఏటీఎంలలో ఈ సౌకర్యం అందుబాటులోకి రావాలని స్పష్టం చేసింది. ఈ మార్పుల కోసం బ్యాంకులు కొత్తగా ఏటీఎం యంత్రాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం ఉన్న యంత్రాల సామర్థ్యాన్ని బట్టి వాటిలో చిన్న సర్దుబాట్లు చేస్తే సరిపోతుందని సూచించింది. ఆర్‌బీఐ తాజా ఆదేశాలతో ఇకపై ఏటీఎంలలో చిన్న నోట్ల లభ్యత గణనీయంగా పెరగనుంది.

## తెలంగాణకు హెచ్చరిక... నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు

**హైదరాబాదే, ఆగష్టు 26:** తెలంగాణ రాష్ట్రాన్ని వర్షాలు ముంచెత్తనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. కొన్ని జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన జారీ చేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఉదయం వాయవ్య బంగాళాఖాతం, ఒడిశా తీర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడింది. ఇది రానున్న రెండ్రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో తెలంగాణలో మంగళ, బుధవారాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తాయని అంచనా వేశారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం, ఈ రోజు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తూర్పు తెలంగాణలోని జిల్లాల్లో కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక రేపు ఖమ్మం, కొమురంభీం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉందని తెలిపింది. వీటితో పాటు ఆదిలాబాద్, హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన నివేదికలో స్పష్టం చేసింది.

## సముద్రంలో శత్రువులకు చెక్.. నౌకాదళంలోకి రెండు స్వదేశీ యుద్ధనౌకలు

**ఢిల్లీ, ఆగష్టు 26:** భారత రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానం మరోసారి తన సత్తాను చాటింది. దేశీయంగా నిర్మించిన రెండు అత్యాధునిక నీలగిరిక్లాస్ స్టెల్త్ యుద్ధనౌకలు 'ఐఎన్ఎస్ హిమగిరి', 'ఐఎన్ఎస్ ఉదయగిరి' మంగళవారం నౌకాదళంలోకి ప్రవేశించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఈ రెండు యుద్ధనౌకలను లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోని రెండు వేర్వేరు ప్రతిష్ఠాత్మక షిప్‌యార్డ్‌ల నుంచి ఒకేసారి రెండు ప్రధాన యుద్ధనౌకలను ప్రారంభించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రాజెక్ట్ 17 ఆల్ఫా (పీ17ఏ)లో భాగంగా ఈ యుద్ధనౌకలను నిర్మించారు. ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను, సాంకేతికతను వినియోగించారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని అధికారులు తెలిపారు. ఐఎన్ఎస్ హిమగిరిని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) నిర్మించగా, ఐఎన్ఎస్ ఉదయగిరిని ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ (ఎండీఎల్) తయారుచేసింది. ఈ రెండు నౌకలు ఒకేసారి దళంలోకి చేరడం, దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యం ఎంతగా పెరిగిందో తెలియజేస్తోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకలు తూర్పు నౌకాదళంలో సేవలు అందించనున్నాయి. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని, వారి 'ముత్యాల హారం' వ్యూహాన్ని అడ్డుకోవడంలో ఈ యుద్ధనౌకలు కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. ఈ నౌకల చేరికతో భారత నౌకాదళ యుద్ధ సన్నద్ధత మరింత పెరిగింది.

**నౌకల ప్రత్యేకతలివే..**

సుమారు 6,700 టన్నుల బరువు, 149 మీటర్ల పొడవు ఉండే ఈ నౌకలు గంటకు 28 నాట్ల (సుమారు 52 కిలోమీటర్లు) వేగంతో ప్రయాణించగలవు. వీటిలో అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీని వాడటం వల్ల శత్రువుల రాడార్లకు సులభంగా చిక్కవు. బరాక్ 8, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, 76 ఎంఎం గన్ లతో వీటిని శక్తిమంతం చేశారు. అంతేకాదు, టార్పెడోలను ఎదుర్కొనే మారీచ్ వంటి పటిష్ట వ్యవస్థలను వీటిపై మోహరించారు. అంతేకాకుండా, రెండు హెలికాప్టర్లను కూడా ఆపరేట్ చేయగల సామర్థ్యం వీటి సొంతం.

## హైదరాబాద్ మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం..

**హైదరాబాదే, ఆగష్టు 26:** హైదరాబాద్‌లోని ప్రముఖ మహీంద్రా యూనివర్సిటీలో మాదకద్రవ్యాల వాడకం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఐదుగురు విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడం ఆందోళన కలిగిస్తోంది. ఓ రెస్టారెంట్ యజమాని ఇచ్చిన కచ్చితమైన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు వర్సిటీలో సోదాలు జరిపి భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. 50 మంది విద్యార్థులను దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు మహీంద్రా యూనివర్సిటీలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో కిలోన్నర గంజాయితో పాటు 47 గ్రాముల ఓజీ వీడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీమారుతి కొరియర్ సర్వీస్ ద్వారా ఢిల్లీ నుంచి ఈ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. గతంలో విద్యార్థులు నిక్ అనే నైజీరియన్ నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలోని పలు పబ్‌లలో పార్టీలు చేసుకున్నట్లు కూడా గుర్తించారు. డ్రగ్స్ బారిన పడిన విద్యార్థులకు పోలీసులు ప్రస్తుతం కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

## ఓటర్ అధికార్ యాత్రలో సీఎం

హైదరాబాద్: బిహార్‌లో కాంగ్రెస్ ముఖ్యనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఓటర్ అధికార్ యాత్రలో పాల్గొన్నారు. వారితో పాటు ర్యాలీ నిర్వహించారు. రానున్న బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమిని గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాహుల్, ప్రియాంకలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిహార్‌లోని దర్భంగా వెళ్లారు. వారితో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. తెలంగాణ మంత్రులు, నేతలు విడిగా మరో విమానంలో వెళ్లారు. తెలంగాణ స్థానిక సంస్థలలో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు తీసుకుంటున్న చర్యలను రేవంత్‌రెడ్డి అగ్రనేతలకు వివరించినట్లు సమాచారం. రానున్న బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో కూడా చురుగ్గా పాల్గొని పార్టీ విజయం కోసం కృషి చేయాలని సీఎంకు ప్రియాంక, రాహుల్ సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వారిద్దరితో పాటు, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితరులతో కలిసి రేవంత్ పాల్గొన్న ఓటర్ అధికార్ ర్యాలీకి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్' అనే నినాదంతో రాహుల్‌గాంధీ ఓటర్ అధికార్ యాత్ర నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం పదోరోజు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి ప్రజలను పలకరిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు ప్రియాంకను కలిసి విడిగా మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనలో భాగంగా చేపట్టిన కులగణన సర్వే, దాని ప్రకారం అసెంబ్లీలో బిల్లు ఆమోదం వివరాలను ఆమెకు చెప్పారు. మంగళవారం సాయంత్రం సీఎం, మంత్రులు తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. తెలంగాణలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర వివరాలను సైతం ప్రియాంకకు వివరించినట్లు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

## ట్రంప్ గొంతెమ్మ కోరికలు... భారత రైతులకు సవాళ్లు!

భారతదేశం తమ దగ్గర నుంచి చమురు, ఆయుధాలు కొనాలంటూ అమెరికా ఒత్తిడి చేయడం అందరికీ తెలిసిందే. కానీ, తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుబట్టడం పెద్దగా వెలుగులోకి రావడం లేదు. అమెరికా గ్రామీణ ఓటర్ల మెప్పు పొందడం కోసం ట్రంప్ మన రైతులను దెబ్బతీయడానికి సిద్ధమవుతున్నారు. అగ్రరాజ్య ఒత్తిడి కారణంగా భారత ప్రభుత్వం పత్తిపై కొంత సడలింపు వైఖరి చేపట్టింది. కొత్త పత్తి సీజనుకు ముందు విదేశీ పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని 40 రోజులపాటు తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇక్కడ విదేశీ పత్తి అంటే అమెరికన్ పత్తి దిగుమతులే. ట్రంప్ తెస్తున్న ఒత్తిడే భారత్‌ను ఈ నిర్ణయానికి పురిగొల్పిందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఇండియాకు దిగుమతి అవుతున్న విదేశీ పత్తి ధర ఒక క్యాండీకి (355.6 కిలోలకు) రూ.50వేల నుంచి రూ.51వేలుగా ఉంది. భారత పత్తి సంస్థ (సీసీఐ) ఒక క్యాండీ పత్తిని రూ.56వేల నుంచి రూ.57వేల ధరకు విక్రయిస్తోంది. పత్తికి కొత్త కనీస మద్దతు ధరను రూ.61వేలుగా నిర్ణయించవచ్చు. ఈ పరిస్థితిలో తక్కువ ధరకు విదేశీ పత్తిని మన మార్కెట్‌లోకి అనుమతిస్తే మన రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. పత్తిని ఎక్కువగా పండించే రాష్ట్రాల ఆదాయానికీ గండి పడుతుంది.

**ఇతర దేశాల నెత్తిన చేయి...**

విదేశీ పత్తి చవకగా లభ్యమవడం వల్ల కాస్తోకూస్తో లాభపడేది వస్త్ర తయారీ పరిశ్రమ మాత్రమే. ఈ పరిశ్రమకు ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయి. అసలు అమెరికన్ పత్తి చవకగా లభిస్తుండటానికి కారణం ఆ దేశ ప్రభుత్వం తమ రైతులకు భారీ సబ్సిడీలు ఇవ్వడమే. అమెరికా సర్కారు పత్తితోపాటు మరెన్నో వ్యవసాయోత్పత్తులకు సబ్సిడీలిస్తోంది. అలాంటి ఉత్పత్తులైన పాలు, చీజ్, చక్కెర, సోయాబీన్, మొక్కజొన్న, బియ్యం, కనోలా వంటనూనె, ఇథనాల్‌లను కూడా భారత్‌పై రుద్దాలని ట్రంప్ చూస్తున్నారు. భారతదేశం ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) నిబంధనల ప్రకారమే తన పాడి పరిశ్రమనూ, మొక్కజొన్న తదితర వ్యవసాయోత్పత్తులను కాపాడుకుంటోంది. కానీ, అనేక అంతర్జాతీయ ఒప్పందాలనూ సంస్థలనూ పక్కకు నెట్టేస్తున్న ట్రంప్ సర్కారు డబ్ల్యూటీవోను కూడా స్వేచ్ఛా వాణిజ్యానికీ, మార్కెట్ అందుబాటుకూ అడ్డంకిగా పరిగణిస్తోంది. ఇతర దేశాలకు తన వ్యవసాయ సరకులను స్వేచ్ఛగా ఎగుమతి చేయాలనుకొంటున్న ట్రంప్ అమెరికాకు పోగాకు ఎగుమతులపై మాత్రం 350శాతం సుంకాలు విధిస్తున్నారు.

## సంపాదకీయం



# సకల కార్యసిద్ధికి గణపతి ఆరాధన

భారతీయుల పండుగలన్నీ విజ్ఞా వినోదాల కలయికతో కూడుకొని ఉ ంటాయి. ప్రతి పండుగలోనూ సంప్రదాయము, ఆచార వ్యవహారాలు, ఆరాధ్యన, విజ్ఞానము, పారమార్థిక దృష్టి, చింతన, సంస్కృతీ పరిరక్షణ సంపుటీకరించబడి ఉంటాయి. మన పండుగలు దైవారాధనకు మార్గదర్శకాలే హిందువులందరూ ఆచరించే పండుగల్లో, వ్రతాల్లో వినాయక చవితి ఎంతో ప్రాచుర్యం పొందింది. మన దేశంలో త్రిమూర్తుల తర్వాత విశేషంగా పూజించబడే దైవం వినాయకుడు. పరమ పవిత్రమైన వినాయక చవితి పర్వదినం, విఘ్నేశ్వరుని సకల జనావళి తమతమ మనోభీష్ట సిద్ధికై వేడుకొనే శుభదినం. పార్వతీదేవి నందనుడైన గణపతి ఈ శుభదినాన అఖండ భారత దేశంలోనే కాకుండా సమస్త ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. గణపతిని పూజిస్తే భక్తులకు కార్యసిద్ధి, ఉత్తమ బుద్ధి సిద్ధిస్తాయి. కార్య సిద్ధి జరిగితే ఫలితం క్షేమంగా, సంతోషంగా ఉంటుంది. ఉత్తమ బుద్ధి చేకూరేతే జ్ఞానమనే లాభం కలుగుతుంది శివుడు, అపజయాలకు కారణ భూతుడవు కమ్మని, సకల శుభ కార్యాలకు ముందుగా దేవతలందరి కంటే పూజలందుకొమ్మని, లేని యెడల సకల కార్యాలకు విఘ్నాలు కలుగుతాయని ఆశీర్వదించిన బాలుడే "గణపతి", గణములకు అధిపతి, 'గణపతి' అనగా 'గ' అంటే వివేకము 'ణ' అనగా మోక్షం లేక ముక్తి అని, వివేకము మోక్షమును ప్రసాదించు "పతి" గణపతి. గణపతి దేవుడు వేదమంత్రాలకు అధిపతియని వేదాలు, ఉపనిషత్తులు అనేక విధాల స్తుతించాయి. ఈ సృష్టి అంతా ఎవరి వలన పుట్టిందో, ఎవరి మీద ఆధారపడి ఉందో, ఎవరిలో లయం అవుతుందో అట్టి సాక్షాత్తు పరమేశ్వరుడే గణపతియని ఉపనిషత్తులు విశదీకరిస్తున్నాయి. సప్తకోటి మహామంత్రాలు గణపతి ఆగమందే ఉన్నాయి. దాని రహస్యం బ్రహ్మకు, శంకరునికీ తెలుసు, సృష్టికి ముందు, సృష్టి తర్వాత ప్రళయానంతరం కూడా సత్వ స్వరూపుడై ప్రకాశించేవాడే గణపతి. గణానాంత్వాం గణపతిం అనే వేదమంత్రం వినాయకుని పండితులలో గొప్పపండితుడు అని చెప్పింది. అదే మంత్రంతో ఉపమానాభూతమైన చేటలవంటి చెవులుగలవాడని కీర్తించబడింది. చేటలవంటి చెవులు జ్ఞాసంపదను ప్రతిఫలిస్తుంటాయి. తన చేటంత చెవులద్వారా భక్తుల ప్రార్ధనలను, కష్టాలను వింటాడట. భక్తులకు ఎలాంటి విఘ్నాలు కలుగకుండా కాపాడుతాడు. గాబట్టి గణవతి విఘ్నునివారకుడని స్తుతించబడుతున్నాడు.. భాద్రపద శుద్ధ చవితి రోజు వినాయకుడి పుట్టినరోజు, ఏ శు భకార్యమైనా, ఏ దేవుడికి పూజచేసినా తొలిగా గణపతిని పూజించడం మన సంప్రదాయం. ఏ శుభకార్యం అయినా ఆటంకాలు లేకుండా జరగడానికి శుక్లం భరధరం అంటూ వినాయకుడ్ని ధ్యానించి పూజిస్తాం. రూపాన్నిబట్టీ, ఆధిపత్యాన్ని బట్టీ, చేసే పనిని బట్టి, వినాయకుడు, విఘ్నేశ్వరుడు, గణపతి, హేదంబుడు, గజాననుడు, ఏకదంతుడు, లంబోదకుడు అని పేర్లు ఏర్పడ్డాయి గణపతి సర్వసంపత్ప్రదాత, భక్తుల ప్రార్ధనలకు సమర్పించిన మోదకాలకు పొంగిపోయే సులభవశుడు. భారతీయ పురాణాలో గణపతి గురించి విస్తృతంగా చెప్పబడింది. ప్రత్యేకంగా యుద్గల పురాణంలో గణపతి ఎనిమిది అవతారాలను ఎత్తినట్లుగా, వక్రతూడ, మహోదరు, ఏకదంత, గజానన, లంబోదర, వికట, విఘ్నరాజ, దూమ్రవర్ణ, అని ఎనిమిది పేర్లు, ఈ ఎనిమిది అవతారాల్లోనూ గణవతి ఏనుగు తొండాన్ని కలిగివున్నాడు. పైగా ఎనిమిది అవతారాల్లో వేర్వేరు వాహనాలను అధిరోహించాడు. భద్రంద శుద్ధ చవితినాడు తూమనుదయించే నక్షత్రాలన్నింటిని కలిపితే గతి రూపంలో కనబడుతాయి. ఆ రూపం క్రింద ఇంకొక నక్షత్ర మండలంలో ఒక ఎలుక రూపం కనబడుతుంది. రవి భాద్రపదంలో సిలో ఉదయిస్తాడు. సింహరాశికి ముందు కర్కాటక రాశి ఉంటుంది. నక్షత్రం అశ్లేష ఆ నక్షత్ర చిహ్నం సర్పం. అందుకే గణపతి నదుముకి సర్పం ఉ టుంది. ఈ మండలానికి చేసే పూజ వినాయకపూజ. గణపతి ఏనుగు ముఖం గలవాడు అంటే ఆయన ముఖం చాలా విశాలంగా ఉంటుంది. ఏనుగు సాధారణంగా ఏ జంతువునూ లెక్క చేయదు తనపాటికి తాను గంభీరంగా తొండాన్ని అటు ఇటు కదుపుతూ ముందుకు సాగిపోతుంది. వివేకవంతులు కూడా ఎవరినీ పట్టించుకోకుండా, ఒక వేళ ఎవరు ఆటంకపరిచినా ధైర్యంగా ముందుకు వెళ్ళి పోతారువారు. తలపెట్టిన కార్యాన్ని నిర్విఘ్నంగా తీసుకపోతారనేదే దీని భావన. వినాయకుని దంతం ఎందుకు విరిగింది? పరశురాముడు మహాముక్కోపి శివభక్తుడు. ఒసారికైలాసం వస్తాడు. శివపార్వతులను దర్శించాలనుకుంటాడు. ద్వారం వద్దనున్న గణపతి పరశురాముడిని అద్దుకుంటాడు. దాంతో ముక్కోపి అయిన పరశురామముడు ఆగ్రహిస్తాడు. ఇద్దరికీ భయంకరయుద్ధం జరుగుతుంది. ఆయుద్ధంలో వినాయకుడు తన తొండంతో ఎత్తి పరశురాముడిని దూరంగా విసిరేస్తాడు. పరశురాముడు తనకి శివుడు ప్రసాదించిన మహిమాన్వితమైన పరశు వుని వినాయకుడిపై ప్రయోగిస్తాడు.. ఆపరశువు దెబ్బవల్లే వినాయకుని దంతం విరిగిందని ఓ పురాణ ఐతిహ్యం.

## గణపతికి తొలిగా కొబ్బరికాయ ఎందుకు కొడతారు

గణవతి పూజ కొబ్బరికాయ కొట్టి మొదలు పెడతాం. ఇలా కొబ్బరి కాయ కొట్టడంలో ఒక పరమార్ధం దాగిఉంది, తామ్ర, లోహ, స్వర్ణ ఈ మూడు త్రిపురాలను ఆక్రమించిన ముగ్గురు రాక్షస రాజులు, ప్రజలను పట్టిపీడిస్తుంటే శివుడు వారిని సంహరించడానికి పూనుకోగానే ఏదో ఒక విఘ్నం సంభవించేదట. విఘ్నరాజైన పుత్రుడు వినాయకుని సంప్రదించగా విఘ్నరాజు సూచన ప్రకారం శివుడికి ప్రతిరూపంగా మూడు రంధ్రాలున్న కొబ్బరికాయను చేధించి వినాయకుడికి నైవేద్యంగా సమర్పించి, ఆ ముగ్గురు రాక్షసులను ఎలాంటి విమచ్నాలు లేకుండా సంహరించాడు. ఆ నాటి నుండి వినాయకపూజకు ముందుగా కొబ్బరి కాయ కొట్టడం మొదలైందని ఐతిహ్యం. నిమజ్జనంః నీళ్ళ స్థానంగా కలిగినటువంటివాడు నర నారాయణుడు ఎవరో కాదు సాక్షాత్తు శ్రీమహావిష్ణువే. గణపతిని ఉత్సవాల అనంతరం నీటిలో నిమజ్జనం చేస్తున్నామంటే, గణపతి రూపమైన విష్ణుమూర్తి యొక్క స్థానమైన నీటిలో నిమజ్జనంలోని ప్రాముఖ్యత. వినాయక నిమజ్జన మట్టి మహిమ: వినాయకుని పూజించి చివరి రోజున చెరువుల్లో, బావుల్లో, నీటిలో నిమజ్జనం చేస్తారు. భూజలతత్వాల నుంచి ఏర్పడిన మూర్తి, తిరిగి అవే తత్వాలలోనికి చేరడం ప్రకృతి ధర్మం, వినాయకుడిని నీటిలో నిమజ్జనం చేసినపుడు ఆచోట నుంచి కొద్ది మట్టిని తెచ్చి ధాన్యపు గాదెల్లో వేస్తారు. రైతులు, ఇలా చేయడం వలన పంటలు బాగా పండి, గాదెల నిండ ధాన్యం పుష్కలంగా చేరుతుందని రైతన్నల నమ్మకం. పూర్వం కలుషిత జలాన్ని శు భ్రపరిచేందుకు ఈనాటి మాదిరిగా సౌకర్యాలు ఆనాడు ఉండేవికావు. నీరుకలుషితం కాకుండా వినాయకుడి పూజలో ఉపయోగించిన ఏకవింశతి (21) పత్రాలను నీటిలో నిమజ్జనం చేయడం వలన ఔషధీగుణాలు కలిగిని పత్రాలు నీటిని శుభ్రపరిచి, కాలుష్యాన్ని వ్యాధి కారకక్రిములనూ పోగొట్టి నీటిని శుద్ధిచేస్తాయి. ఇది వినాయకపూజ పత్రాల్లో దాగిన రహస్యం.

## కాణిపాక వరసిద్ధి వినాయకుడు

ఈ దేవాలయాన్ని 11వ శతాబ్దంలో కుళోత్తుంగ చోళరాజు బ్రహ్మహత్యా పాతక నివృత్తికోసం కట్టించినట్లు చరిత్ర చెపుతోంది. విజయనగర రాజులు కూడా ఈ ఆలయానికి మెరుగులు దిద్దునిట్లు తెలుస్తోంది. ఈ ఆలయం చిత్తూరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ వరసిద్ధి వినయకుడిని దర్శించుకున్నవారి సంకల్పాలు నెరవేర్చే, ఈ ఆలయం ఎదురుగా కోనేరు మంటవంతో అలరారుతుంది. అలాగే మన రాష్ట్రంలో చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరాయం, కాజీనూటలో శ్వేతార్కమూల గణపతి దేవాలయం, రాయదుర్గంలో దశభుజ గణపతి ఆలయం, కుర్తాళంలో నాడీ గణపతి దేవాలయాలు ప్రసిద్ధి గాంచాయి. మనకు ఎందరు దేవుళ్ళు ఉన్నా వినాయకుడిని తొలిగా పూజించిన తర్వాతే తక్కినవారు ఇల్లు కట్టినా, పొలం దున్నినా, చదువు, 'వృత్తి, ఉద్యోగం, పెళ్ళి. పేరంటమైనా గణపతిని ఆరాధించ వలసిందే! గణపతిని ఆరాధిస్తే విఘ్నాలు తొలగించి, సంకల్పాలు నెరవేర్చి, మోక్షాన్ని ప్రసాదిస్తాడు. గణపతిని ఉపాసన సకల కార్యసిద్ధికి ఆలంబనము. భారతదేశంలోనే కాదు చైనా, జపాన్, మెక్సికో, గ్రీన్, బర్మా థాయ్లాండ్, మయన్మార్, జావా, టిబెట్, కాబోడియా, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక వంటి దేశాల్లో వినాయక ఆరాధన ఉంది. శాంతి సౌభాగ్యాలకు నిలయమైన అఖిలాండకోటి బ్రహ్మండాలను తనలో దాచుకున్న గణపతిని ఆరాదిద్దాం! స్మరిద్దాం!! తరదిద్దాం!!! "ప్రజాస్ఫూర్తి దినపత్రిక" సంపాదకులకు పాఠకులకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు!



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 : హయత్ నగర్ : హైదరాబాదు



# వినాయక వ్రతం ఎప్పటిలోగా ఆచరించాలి?

## ఈ నవరాత్రులపై గ్రహణ ప్రభావమెంత?

**ఊరూవాడా కొలువై ఉండ్రాళ్లు ఆరగించే బొజ్జ గణపయ్య.. మనలో ధైర్యాన్ని, స్ఫూర్తిని నింపి మనల్ని ఆశీర్వదించేందుకు మండపాల్లోకి విచ్చేస్తున్నాడు. దేశమంతా ఎంతో వైభవంగా నిర్వహించే పండుగ వినాయక చవితి ఆగస్టు 27న జరగనుంది. సిద్ధి, బుద్ధి ప్రదాత అయిన విఘ్నేశ్వరుడి వ్రతం బుధవారం రావడం చాలా విశేషం. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట లోపు ఆచరించడం ఉత్తమం.**

### * నాయతి నాయయతీతి వ నాయకః విశేషణ నాయకః వినాయకః

పూర్వ జన్మ పాప పుణ్యాలకు సరిపడే తీరులో మనల్ని నడిపించేవాడు గణాధిపతి. అలాంటి గణేశుడిని వినాయక చవితిరోజు ఒక్కరోజు పూజించినా సకల పాపాలు నశించి, విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయి. భారతీయ సనాతన ధర్మంలో షోడశ కర్మలు (1. గర్భాదానం; 2. పుంసవనం; 3. సీమంతం; 4. జాతకర్మ; 5. నామకరణం; 6. నిష్క్రమణ; 7. అన్నప్రాశన; 8.చూడాకరణ; 9. కర్ణవేద; 10. అక్షరాభ్యాసం; 11. ఉపనయనం; 12. వేదారంభం; 13. కేశాంత; 14. సమావర్తన; 15. వివాహం; 16. అంత్యేష్టి) ఆచరించాలన్నా; శుభకార్యాలు, వ్రతాలు చేయాలన్నా విఘ్నేశ్వరుడి పూజలేకుండా ఆచరించరాదని శాస్త్రం చెబుతోంది. పాప పుణ్యాలను తొలగించి మోక్షాన్ని ఇప్పించే గణపయ్యను వినాయక చవితి రోజున పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి.

### * మట్టి విగ్రహాన్నే ఎందుకు పూజించాలి?

చెరువులు, నదుల వద్ద ఉన్న మట్టితో విఘ్నేశ్వరుడిని చేసి ఆ ప్రతిమను పూజించాలంటోంది శాస్త్రం. ఈ సృష్టి మొత్తం ఒకే పదార్థం నుంచి ఏర్పడింది (ఏకమై పరమై) .. తిరిగి అదే పదార్థంలో లయమవుతుందనేది వేదమంత్రం చెప్పింది. ఏ మట్టి నుంచైతే విఘ్నేశ్వరుడు వినాయక రూపంలో ఆవిర్భవించి పూజలందుకున్నాడో, అదే మట్టిరూపం తిరిగి యథాస్థానంలో లయమవుతుంది. అనగా, ఈ సృష్టిలో ప్రతి ప్రాణీ ఏ భగవంతుడి వద్ద నుంచి వచ్చిందో తిరిగి అక్కడే లయం అవ్వాలి. ఈ మధ్యలో ధర్మ మార్గంలో నడుస్తూ భక్తి మార్గాన్ని పెంపొందించుకుంటూ జ్ఞానమార్గాన్ని వెతుక్కుంటూ మోక్షమార్గాన్ని సంపాదించి ఆ పరమాత్ముడిలో లయం కావాలనేటువంటి నిగూఢ రహస్యం ఈ వ్రతంలో దాగి ఉంది. అందువల్ల మట్టి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పూజించాలి.

### గ్రహణ ప్రభావం

విఘ్నేశ్వరుడి వ్రతం అనంతరం గణేశ నవరాత్రులు ఆచరించడం శాస్త్రసమ్మతం. గణపయ్యకు పత్రి పూజ చేస్తూ ఆయా ప్రాంతాల్లో ఆచారాలను బట్టి 1, 3, 5, 7, 9, 11, 21 రోజుల పాటు పూజించడం ఆచారం. అయితే, శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో సెప్టెంబర్ 7న రాహుగ్రస్త చంద్ర గ్రహణం ఏర్పడనుండటంతో అంతకుముందే గణేశ్ నిమజ్జనం పూర్తి చేసుకోవడం ఉత్తమం.

### 21 రకాల పత్రాలు ఇవే..

విఘ్నేశ్వరుడికి అనేక రూపాలు ఉన్నాయి. పురాణాలు, ఆగమ శాస్త్రాల్లో గణపతికి 33 రూపాలు వర్ణించబడ్డాయి. ప్రతీ రూపానికీ ప్రత్యేక ఆరాధన, ఫలితాలను చెప్పారు. వినాయక చవితి రోజున సింహాసనంపై కూర్చొన్న నాలుగు లేదా ఆరు చేతులు కలిగిన గజముఖంతో ఉన్నటువంటి ముఖ్యంగా ఒక చేతిలో కుడుములు, మరో చేయి ఆశీర్వచనం ఇచ్చేలా ఉన్నటువంటి మట్టిగణపతిని పూజించడం శ్రేష్ఠం. వినాయక వ్రతంలో ఏకవింశతి పత్ర పూజ (21) ఎంతో ప్రాధాన్యమైనది. ఆ పత్రాలన్నీ ఔషధ గుణాలతో కూడినవి కావడంతో భాద్రపదమాసంలో ఇంట్లో పూజలు చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు ఉండవని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది.



### నిష్ఠగా నిమజ్జనం

వినాయక వ్రతం అనంతరం నిమజ్జనం ఎంతో కీలక ఘట్టం. విఘ్నేశ్వరుడిని ఎంత భక్తితో పూజిస్తామో, వినాయక నిమజ్జనాన్నీ అంతకంటే ఎక్కువ భక్తిశ్రద్ధలతో ఆచరించాలి. విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేసే రోజు ఉపవాసం ఆచరించాలి. విఘ్నేశ్వరుడి నిమజ్జనం సముద్రం/నదులు/తటాకములు/ఇంట్లో లోతైన పాత్రల్లో గానీ భక్తి శ్రద్ధలతో, ఎలాంటి ఆడంబరాలకు పోకుండా చేయాలి. విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేసేటప్పుడు కాళ్లకు చెప్పులు ధరించకూడదు. ఆరోగ్యం రీత్యా ఉపవాసం చేయలేనటువంటి వారు విఘ్నేశ్వరుడికి సమర్పించిన లేదా నివేదించిన ప్రసాదాలను మాత్రమే స్వీకరించాలి. నిష్ఠగా వినాయక వ్రతాన్ని ఆచరించిన వారికి స్వామివారి అనుగ్రహం లభిస్తుంది. వినాయక వ్రతాన్ని ఆచరించేటప్పుడు గణపతి కథలను వింటూ అక్షింతలను దగ్గర పెట్టుకోవాలి. వ్రతం పూర్తయ్యాక వాటిని తలపై వేసుకోవాలి. మరీ ముఖ్యంగా వినాయక వ్రత కథలలో శమంతకోపాఖ్యానం కచ్చితంగా పఠించడం ద్వారా అపనిందలు తొలగి శుభాలు కలుగుతాయి.



# ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కలిసి శ్రమిద్దాం..

* **జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా రోడ్డు భద్రతకు సంబంధించి, తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత శాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మోటారు వాహనాలు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధిక మవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల భారిన పడిన వారి కుటుంబ సభ్యులు అనాధలవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, ఆర్అండ్‌బీ, వైద్యశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి, జైలు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రతి ద్విచక్రవాహనదారుడు



హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసు శాఖను ఆదేశించారు.జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు రబ్బరు వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని రవాణాశాఖను ఆదేశించారు. రహదారుల కూడళ్లు, ధాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో శ్రమిద్దామని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ భద్రాచలం చంద్రశేఖర్, ఆర్ అండ్ బి ఈ ఈ కొత్తగూడెం వెంకటేశ్వర్లు, డిఈ నాగేశ్వరావు, ఎన్ పి డి సి ఎల్ ఎస్. ఇ, మహేందర్, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఇల్లందు శ్రీకాంత్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్డీవో వెంకటరమణ, కొత్తగూడెం నేషనల్ హైవే డి ఈ శైలజ, మెడికల్ డిపార్ట్మెంట్ వీరబాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భారతీయ సంప్రదాయ సంస్కృతులను గురించి బాల్యం నుండే విద్యార్థులకు తెలియజేయడం టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రత్యేక అని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ. వంశీకృష్ణ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీ లో టీవీఆర్ మోడల్ హై స్కూల్, ఎస్ఆర్నాయక్ నగర్లో సత్యవాణి విద్యానికేతన్ స్కూల్ లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగలను గురించి " వినాయక చవితి " ప్రాముఖ్యతను , మన పండుగల ప్రాముఖ్యతను, సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేసి గణపయ్యకు ఇష్టమైన పండ్లు ఉండ్రాళ్ళు పాయసం వంటి నైవేద్యాలను గణపతికి సమర్పించి పూజించే విధానాన్ని తెలియజేశారు.అనంతరం టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, వినాయక చతుర్థి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయరాజ్, అధ్యాపక బృందం నర్సరి, ఎల్కెజీ, యుకెజీ చిన్నారులు పాల్గొని ఆనందించారు.

## మురికి వాడల్లో వైద్య శిబిరాలు పేదలకు చాలా ఉపయోగం



హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకులు తూటే విజయ్ కుమార్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మురికి వాడల్లో ఇలాంటి వైద్య శిబిరాలు పేదలకు చాలా ఉపయోగ పడుతాయని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకులు తూటే విజయ్ కుమార్ అన్నారు. మదర్ థెరెసా 115 వ జయంతి పురస్కరించుకొని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్స్ వారి సౌజన్యంతో మంగళవారం గాజులరామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ లోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్ లో మహిళలు, పిల్లలకు సాధారణ అంశాలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మంది ప్రజలు సేవలను వినియోగించుకున్నారు. అనంతరం ఉచితంగా వైద్యం, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే, వైద్యులు డాక్టర్ విగ్నేష్, డాక్టర్ శ్రీ సాయి ప్రణీత హాస్పిటల్ పి ఆర్ ఓ మహమూద్, స్కూల్ కరెస్పాండంట్ బల్వంత్ కుమార్ యాదవ్, నర్సులు, పాఠశాల సిబ్బంది, తల్లి తండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ కూడా సింపులే"

" **సేవలో అద్భుతాలు... విరమణలో వినమ్రత"**
" **ప్రభు దయాల్ స్ఫూర్తిదాయక సేవలు, సరళ జీవనశైలి అనేకమందికి ఆదర్శం."**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి, రామవరం హై స్కూల్ హెచ్ఎం డాక్టర్ ప్రభు దయాల్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. తన సర్వీసులో డజనుకు పైగా ఆయా స్థాయి పోస్టుల్లో పనిచేసి, ఉత్తమ ఫలితాలను సాధించడంతో పలువురు ఐఏఎస్ అధికారులు ప్రభుదయాల్ సర్వీసు రిజిస్టర్ లోనే ప్రశంసలను రాశారు. ఇది చాలా చాలా అరుదు. ప్రతినెల తన జీతంలో కొంత బీదలకు, బీద విద్యార్థులకు సహాయం చేయడం ఆయన నిత్య కృత్యం. చివరికి తన పదవీ విరమణ సమయంలోను ఎలాంటి హంగుఆర్భాటాలకు తావు లేకుండా, తన స్వగ్రామం ఇల్లెందులో ఒక బీద మహిళ గృహ నిర్మాణంలో తన వంతుగా సహాయం అందిస్తున్నారు. పని విషయంలో రాజీ పడకుండా, వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించే దిట్టగా పేరొందారు. పనిచేసిన చోటల్లా సదరు సంస్థలను ఉన్నత స్థాయిలో ఉంచడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అవసర సమయాలలో ఇతరులకు సహాయం చేస్తే లభించే తృప్తి మరెక్కడ లభించదంటారు ప్రభు దయాల్.

## కాపురానికి తీసుకెళ్లడం లేదని.. భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా..!

* **అక్కడే భోజనాలు చేసి నిరసన.**
* **పోలీసులు నచ్చచెప్పడంతో ధర్నా విరమించిన బాధితురాలు.**



ప్రజా స్ఫూర్తి నల్లగొండ: కట్న కానుకలు దండిగా స్వీకరించిన ఓ భర్త.. పెళ్లయిన మూడు నెలలకే భార్యను వదిలించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. సూటిగా కారణాలు చెప్పకుండా.. సూటిపోటి మాటలతో ఇబ్బందులు పెట్టి తల్లిగారింటికి వెళ్ళగొట్టారు. దీంతో అమ్మాయి తల్లిదండ్రులు కన్నీటి పర్యాంతమై.. పలుమార్లు అల్లుడిని బ్రతిమలాడారు. తమ కూతురుని కాపురానికి తీసుకెళ్లాలని వేడుకున్నారు. అయినప్పటికీ అల్లుడు ససేమిరా వినకపోవడంతో.. ఆవేదన చెంది.. పెద్ద మనుషులు.. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగారు. అయినప్పటికీ అల్లుడులో మార్పు రాలేదు. కూతుర్ని కాపురానికి తీసుకెళ్లలేదు. దీంతో అమ్మాయి తల్లిదండ్రులు తీవ్రంగా దుఃఖిస్తుండగా.. ధైర్యం చేసిన అమ్మాయి.. తన భర్తకోసం..న్యాయం కోసం..సరాసరి తన భర్త ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. బంధువులతో కలిసి తనకు న్యాయం చేయాలంటూ వేడుకుంటుంది. వివరాల్లోకి వెళితే.. త్రిపురారం మండలంలోని బెజ్జికల్ గ్రామానికి చెందిన బాధిత వివాహితురాలు.. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ గల లకడాపురం సత్యనారాయణ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ నల్గొండ పట్టణానికి చెందిన లకడాపురం సత్యనారాయణ కుమారుడు మహేందర్ తో తనకు ఆరునెలల క్రితం వివాహం జరిగిందని తెలిపింది. వివాహం జరిగిన రెండుమూడు నెలల నుండి తన అత్త సైదమ్మ,ఆడబిడ్డ శ్రీలత ల చెప్పుడు మాటలతో.. వివిధ కారణాలతో తన భర్త మహేందర్.. తనను ఇబ్బందులకు గురిచేస్తూ కాపురానికి తీసుకెళ్లడం లేదని ఆవేదనతో తెలిపింది. ఈ విషయంపై త్రిపురారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిపారు. అయితే ఇరుకుటుంబాల సభ్యుల వాదనలు విన్న పెద్దమనుషులు.. వివాహ సమయంలో తాము ఇచ్చిన బంగారు ఆభరణాలు, వరకట్నం తిరిగి ఇవ్వాలని తీర్మానించగా.. అవి ఇవ్వకుండా.. తనను కాపురానికి తీసుకెళ్లకుండా.. తన భర్త మహేందర్ తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. తన జీవితంతో చెలగాటం ఆడుతున్న భర్త మహేందర్.. అతని కుటుంబసభ్యులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

## ఇష్టంగా కష్టపడి చదివితే సాధించలేనిదేమీ లేదు

- **న్యాయ విద్యను చదువుతూనే కానిస్టేబుల్‌గా ఎంపిక**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఇష్టంగా కష్టపడి చదివితే సాధించలేనిదేమీ లేదని రుజువు చేశాడు ముస్తాబాద్ మండలంలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన శివ్వని రాగయ్య ఎల్లవ్వ దంపతుల చిన్న కుమారుడు శివ్వని బాల లింగం. విద్యార్థి నాయకునిగా మొదలై అనేక మలుపుల తరువాత న్యాయ విద్యను చదువుతూనే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. టిఎన్ఎస్ఎఫ్ సిరిసిల్ల టౌన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షునిగా పని చేశాడు. ప్రస్తుతం సిఎం రేవంత్ రెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలో బాల లింగం కూడా కాంగ్రెస్‌లో చేరారు. అనతికాలంలోనే ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర సెక్రటరీగా భాధ్యలు చేపట్టి పలు కార్యక్రమాలు చేశాడు. 2017లో న్యాయ విద్య ప్రవేశ పరీక్ష రాసి మహాత్మా గాంధీ లా కళాశాలలో చేరి అప్పుడే విడుదలైన పోలీస్ నోటిఫికేషన్‌తో పోలీస్ ఉద్యోగం సాధించాలని లా చదువును వదిలాడు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతూ 2018లోఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలనూ వ్రాసి చివరిలో మెయిన్స్ ఎగ్జామ్‌లో కట్ ఆఫ్‌తో విఫలమయ్యాడు. 2022లో విడుదల చేసిన నోటిఫికేషన్‌కి అప్లై చేశారు. కానిస్టేబుల్ పిఓటిలో 221 మార్కులతో రాష్ట్రంలో 7వ ర్యాంకు సాధించాడు. అటు ఎల్ఎల్‌బి ప్రవేశ పరీక్షలో 2130 రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాడు. అలాగే ఎల్ఎల్ఎంలో స్టేట్ 600 ర్యాంక్ సాధించాడు. దీంతో అతనిపై పలువురు ప్రశంస వర్షం కురిపిస్తున్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి...

- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ...**
- **నియోజకవర్గ విద్య సంస్థలో అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోల్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థల లో జరుగుతున్న నిర్మాణం పనులు, అభివృద్ధి పనుల పై అందోల్ పాలిటెక్నిక్ కళాశాలలో విస్తృతస్థాయిలో మంత్రి సమీక్ష జరిపారు.అందోల్ నియోజకవర్గంలోని విద్యా సంస్థల అభివృద్ధి, మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. నియోజకవర్గంలోని పలు విద్యాసంస్థల పరిస్థితులను సమీక్షించి, అవసరమైన వసతుల కల్పనపై ప్రిన్సిపాల్‌లు, అధికారులతో మంత్రి చర్చించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి, పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలు పునాదిగా నిలుస్తాయని, అందుకే ప్రతి విద్యాసంస్థలో అవసరమైన సౌకర్యాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో పుల్కల్, అందోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అందోల్ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ, శివ్వంపేట పాలిటెక్నిక్, సంగుపేటలో వ్యవసాయ పాలిటెక్నిక్ వంటి సంస్థల ప్రస్తుత పరిస్థితులు చర్చకు వచ్చాయి. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకుని, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఆక్సాన్ పల్లి, పోతుల బొగడ, బస్వాపూర్‌లోని మోడల్ స్కూళ్లు, అలాగే సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అందోల్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, సింగూర్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌లలోని సౌకర్యాల పరిస్థితులపై కూడా విస్తృత చర్చ జరిగింది. విద్యార్థులకు వసతి, ఆహారం, క్రీడా సదుపాయాల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా సూచనలు జారీ చేశారు.

* **బుదేరా మహిళా డిగ్రీ & పీజీ కళాశాలను మోడల్ తీర్చిదిద్దాలి.**

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ మరియు పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్, బుదేరా విద్యాసంస్థ ప్రాధాన్యం పై మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఈ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, హాస్టల్లో వసతి సదుపాయాల పెంపు, డార్మెటరీ సౌకర్యాలు, డైనింగ్ హాల్ విస్తరణ, నూతన కిచెన్ పరికరాలు, ల్యాబ్ సామగ్రి వంటి అవసరాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీ ఎస్ ఈ టి ఎస్ ఈ డబ్ల్యూ ఐ డి సి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈ ఈ రవి కుమార్ , రెవిన్యూ , పోలీస్ , వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు .

## డాకూరి గాలయ్య సేవలు మరువలేనివి...



అందోలు, ప్రజాస్ఫూర్తి : జోగిపేట మాజీ సర్పంచ్ స్వర్గీయ డాకూరి గాలయ్య 35 వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జోగిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయములో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జోగిపేట సర్పంచ్ గా గాలయ్య చేసిన సేవలు మరువలేనిదని, జోగిపేట అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా కార్యక్రమములో మార్కెట్ కమిటి చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఏయంసి చైర్మెన్ పద్మనాభరెడ్డి, మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, గారు మాజీ కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, శంకర్, పిఎసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు డీజి వెంకటేశం, బాలయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, నాయకులు మొరబోయిన కృష్ణ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల స్కూల్లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసాపేటలోని పంచశీల స్కూల్లో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినాయకుడు, శివ పార్వతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. శివ పార్వతులు వినాయకునికి ఆశీర్వాదం ఇవ్వడం ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు పసుపు, మట్టితో తయారుచేసిన వివిధ ఆకృతులను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వినాయక చవితి ప్రాముఖ్యతను , పండుగల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించిన కార్పొరేటర్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : గణేష్ నిమజ్జనోత్సవం సజావుగా, భక్తి శ్రద్ధలతో సాగేందుకు అవసరమైన ఏర్పాట్లను చర్లపల్లి చెరువు వద్ద జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో సమావేశమై నిమజ్జనం సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ సురక్షితమైన వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నట్లు కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసమే సాండ్ బజార్లు..

- **దళారుల జోక్యం లేకుండా నాణ్యమైన ఇసుక సరఫరా....**
- **పేదింటి కళను నెరవేర్చే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుంది...**
- **ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఇసుక సరఫరా...**
- **రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ...**
- **సంగుపేట – జోగిపేట చౌరస్తాలో సాండ్ బజార్ ను ప్రారంభించిన మంత్రి**





అందోలు, ప్రజాస్ఫూర్తి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేసేందుకే ప్రభుత్వం సాండ్ బజార్లను ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం ఆందోలు మండలంలోని సంగుపేట - జోగిపేట చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరసమైన ధరలో అందించడం ప్రభుత్వ ప్రాధాన్య కర్తవ్యం. దళారుల బెడద లేకుండా, పారదర్శక పద్ధతిలో, నేరుగా ప్రజలకు ఇసుక అందించేందుకు ప్రభుత్వం సాండ్ బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .ఇసుక తరలింపు వాహనాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో సాండ్ బజార్లు,ఆందోల్ నియోజకవర్గం సహా జిల్లాలో ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో ఒక సాండ్ బజార్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీని వలన ప్రజలు తక్కువ దూరంలోనే అవసరమైన ఇసుకను సులభంగా పొందగలరని ఆయన పేర్కొన్నారు ఇళ్ల నిర్మాణం, ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లాలో సహజసిద్ధమైన ఇసుక రీచ్‌లు లేవు. ఈ కారణంగా ఇక్కడి ప్రజలు ఇప్పటివరకు అధిక ధరలకు, మధ్యవర్తుల ద్వారా ఇసుక కొనుగోలు చేయవలసి వచ్చేది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాండ్ బజార్లను ఏర్పాటు చేసింది. ఇకపై లబ్ధిదారులు, గృహనిర్మాణదారులు తక్కువ ధరలో, నాణ్యమైన ఇసుకను ఈ బజార్ల ద్వారా పొందవచ్చని మంత్రి తెలిపారు.ఇసుక కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయిందన్నారు. సాండ్ దళారుల బెడదను పూర్తిగా అరికట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఇసుక సరఫరా ప్రక్రియలో ఎవరైనా దళారుల మాదిరిగా వ్యవహరించినా, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ కార్పొరేషన్, రెవెన్యూ, హౌసింగ్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక సరఫరాను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం తరపున మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం లో ఇసుక కొరత సమస్య రాకూడదు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారికి కావలసినంత ఇసుక సాండ్ బజార్లలో నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి అని మంత్రి అధికారులను ఆదేశించారు.సాండ్ బజార్ల ఏర్పాటు వలన స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. చిన్న కాంట్రాక్టర్లు, మేస్త్రీలు కూడా నాణ్యమైన ఇసుకను సులభంగా పొందగలరని అధికారులు తెలిపారు. ఇసుక సరఫరా ఆన్‌లైన్‌లోనూ పర్యవేక్షణ జరుగుతుందని, ఎవరైనా అక్రమ రవాణా చేస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో టీజీఎండిసి ఎండి భవేష్ మిశ్రా , జిల్లా అదనపు ( స్థానిక సంస్థలు)కలెక్టర్ చంద్రశేఖర్ , జిల్లా. మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రఘుబాబు,జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి , మార్కెఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మోహన్ రెడ్డి , పిఎసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి , హౌసింగ్ , రెవిన్యూ , పోలీస్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

## మట్టి వినాయకుడిని పూజిద్దాం...

- **ఆందోలు - జోగిపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు...**
- **కాలనీవాసులకు ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: కాలుష్య రహిత సమాజం కోసం అందరూ పాటుపడి మట్టి వినాయకులనే పూజించాలని అందోలు జోగిపేట మున్సిపల్ 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు అన్నారు. మంగళవారం కాలనీ వాసులకు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిలో నుంచే సకల ప్రాణులు సంపదలు వచ్చాయని, మట్టి వినాయకుని చేయాలంటే చెరువుల నుంచి బంకమట్టిని సేకరించాలి. ఇంటికో గంపెడు మట్టి తీయడం వల్ల అందరూ తనకు తెలియకుండానే తల చేయి వేసి చెరువులలో పూడిక తీసినట్లు అవుతుందన్నారు. ఇది ఒక కారణమైన అసలు కారణం మరొకటి ఉందని అసలు వినాయకుడు పుట్టింది పార్వతి దేవి నలుగు మట్టి నుంచే కదా అందుకే ఆయన విగ్రహాన్ని మట్టితోనే చేయాలి.మట్టి వినాయకుని పూజించడం ద్వారా భక్తి శక్తి కలుగుతుందన్నారు. అలాగే మట్టి వినాయకుని పూజించడం అంటే మన ప్రకృతిని పూజించడంతో సమానమన్నారు. మనకు జీవాన్ని జీవితాన్ని మనుగడని ఇస్తున్న ప్రకృతిని పూజించే అవకాశం మనకు వినాయక చవితి ద్వారా లభిస్తుందని అలాంటి మంచి అవకాశాన్ని వినియోగించుకొని మట్టి వినాయకుడిని పూజించాలని కోరారు.

## కాప్రా చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించిన మల్కాజ్గిరి డిసిపి పద్మజ



ప్రజాస్ఫూర్తి, కాప్రా : గణేష్ నవరాత్రుల సందర్భంగా జరిగే నిమజ్జనోత్సవం సజావుగా, ఎటువంటి అంతరాయం లేకుండా నిర్వహించేందుకు మల్కాజ్గిరి డిసిపి పద్మజ మంగళవారం కాప్రా చెరువును స్వయంగా పరిశీలించారు.ఈ సందర్శనలో ఏసీపీ వెంకట్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు, ఎలక్ట్రికల్ ఇన్‌ఛార్జ్ అధికారులు, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, సెక్టార్ ఎస్సై సుధాకర్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు. డిసిపి పద్మజ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. చెరువు పరిసరాల్లో లైటింగ్, బారికేడింగ్, క్రేన్ల వంటి సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి, పోలీసులు సమన్వయంతో పని చేయాలని,జీహెచ్ఎంసీ , విద్యుత్ శాఖ అధికారులు సమయానుకూల చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే నిమజ్జనం రోజున భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని దృష్టిలో ఉంచుకుని, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల భక్తిశ్రద్ధలతో జరిగే ఈ పండుగ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా అన్ని శాఖలు కలిసికట్టుగా పని చేస్తాయని డిసిపి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.



## వన మహోత్సవంలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలి

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, ( ప్రజాస్ఫూర్తి) : వన మహోత్సవంలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెంచే బాధ్యత తీసుకున్నాం అని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ క్రిస్టియన్ స్మశాన వాటికలో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి లతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ క్రిస్టియన్ స్మశాన వాటిక ను అన్ని హంగులతో సకల సౌకర్యాలతో సుందర శోభిత వనంగా తీర్చిదిద్దడం జరిగినదన్నారు. స్మశాన వాటిక లో ఈ రోజు జరిగిన వన మహోత్సవం సందర్భంగా ఈ రోజు మొక్కలు నాటడం చాలా సంతోషకరమైన విషయం అని, స్మశాన వాటిక లో మొక్కలు నాటి వనమహోత్సవం హరిత వైభవోత్సవం గా విరాజిల్లునని అన్నారు. స్మశాన వాటిక పచ్చని మణిహారం గా మారునుందని, కాలనీ లో ప్రధాన రహదారికిరువైపుల , అంతర్గత రోడ్లలో మొక్కలు నాటడం జరిగినదన్నారు. కాలనీ లో ప్రతి ఒక్కరు బాగసామ్యం అయి మొక్కలు పెట్టి వాటిని పెంచి పెద్ద చేసే బాధ్యత తోసుకోవడం అభినందనియమన్నారు. ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటుతామని, ఔషద గుణాలు గల మొక్కలు , పండ్ల జాతుల మొక్కలు నాటి ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటి సంరక్షిస్తామన్నారు. మానవాళి మనుగడకు మొక్కే శ్రీరామ రక్ష అని, సమస్త జీవ కోటికి ప్రాణధారం మొక్కలు అని అన్నారు. ఖాళీ స్థలాలు,రోడ్లకు ఇరువైపులా,అన్ని రకాల అనువైన ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు.ఈ కార్యక్రమంలో యుబిడి డిప్యూటీ డైరక్టర్ దేవజా, మేనేజర్ శివ జ్యోతి, సూపర్వైజర్ నాగ రాణి, నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మల్లేష్, మహేష్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, రాంచందర్, ఖలీమ్, మహేష్, పాస్టర్లు ఇశ్రాయిల్, కోకిల శ్యాముల్, సత్యరాజు, ఫిలిప్, నాగభూషణం, శామ్యూల్, ముకేశ్, ఎలీషా, దాస్, దేవదాస్, డేవిడ్ రాజు, సతీష్ కుమార్, షాలేం రాజు, శ్రీనివాస్, జి.సుమన్, ఎం.సుమన్, న్యూటన్ బాబు, సిమోన్, విక్టర్ ఇమాన్యుల్, జోషాప్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులువేద్దాం

*** కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మట్టి విగ్రహాలతో వినాయకచవితి పండుగ జరుపుకోవండం ద్వారా పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులువేద్దామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కూనంనేని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్ర హాలతోనే పండగ జరుపుకోవాలని, కెమికల్స్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్ర హాలను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించడం కారణంగా పర్యావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుం దని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థల చొరవతో ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, మరింత ప్రచారం కల్పించడం ద్వారా మట్టివిగ్రహాల ఏర్పాటును విస్తృతం చేయాలన్నారు. కాలుష్యం పెరగడంతో వాతారణంలో సమతుల్యత లోపించి ఉపద్రవాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు, కాలుష్య నివారణ ప్రతిఒక్కరి బాధ్యతని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడువేల మట్టివిగ్రహాలను పంపిణి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ పరిధిలో గణేష్ మంటపాలు వద్ద పారిశుధ్యపనులు చేపట్టాలని, విద్యుత్ సౌకర్యంకల్పించాలను, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకోకుండా పొలిసు శాఖా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలను శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, అధికారులు అహ్మద్, వీరభద్రా చారి, రంగ ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఎస్ కె ఫహీమ్, గెడ్డాడు నగేష్, కేశవరావు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణాచారి, దుర్గ, సతీష్ బాబు, నర్సింహా, అజీజ్, నీడల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో అలసత్వం అనుమతించం

**: ఎంఈఓ ప్రభు దయాల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాఠశాల విద్యా రంగంలో ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని, వాటి అమలులో ఎలాంటి అలసత్వం ఉండరాదని మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ అన్నారు. మండలంలోని సకల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, వర్క్‌బుక్స్, లైబ్రరీ పుస్తకాలు, సైన్స్ ల్యాబ్ పరికరాలు, ఏకరూప దుస్తుల సరఫరా స్థితిపై సమీక్షించారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎఫ్ఆర్ఎస్ నమోదు, లైబ్రరీ పుస్తకాల వినియోగం, మధ్యాహ్న భోజన పథకం అమలు, మెనూ నిర్వహణ, ఈ నెలలో చేపట్టిన విద్యా కార్యక్రమాలపై చర్చించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ రివ్యూ సమావేశంలో సకల హెచ్ఎంలు, ఎంఆర్సి సిబ్బంది, సిఆర్పిలు, డిఆర్పిలు పాల్గొన్నారు.

## పద్మజ మొబైల్స్ ఆధ్వర్యంలో గణేష్ మండపాలకు 20 ఉచిత లడ్డుల అందజేత




ప్రజాస్ఫూర్తి, కాప్రా : గణేష్ నవరాత్రుల పురస్కరించుకొని యువతను ప్రోత్సహించేందుకు కుషాయిగూడలోని పద్మజ మొబైల్స్ అధినేత ఓరుగంటి వీరేష్ ఆధ్వర్యంలో 20 గణేష్ మండపాలకు 5 కేజీల ఉచిత లడ్డులను అందజేశారు. అదే విధంగా వినాయక మండపాలకు పది మొబైల్ ఫోన్లను మరో ఐదు టీవీలను బహుకరించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగా టిఎస్ఐఐసి కాలనీలోని యువసేన యూత్ అసోసియేషన్ గణపతి మండపంలో స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డితో కలిసి యువసేన యూత్ అసోసియేషన్ చైర్మన్ సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఉచిత లడ్డుల డ్రాను తీశారు. 20 మండపాల నిర్వాహకులకు లడ్డూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి నాయకులు రాఘవరెడ్డి, ఏఎస్ రావునగర్ డివిజన్ కన్వీనర్ నీరుకొండ సతీష్ బాబు, పెద్దాపురం కుమారస్వామి, తాడూరి గగన్ కుమార్, నాను, అభిషేక్ రెడ్డి, రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి లోకమాత కాలనీ అసోసియేషన్ ఆఫీస్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్ర.చర్లపల్లి డివిజన్ పరిధిలోని లోకమాత కాలనీ అసోసియేషన్ ఆఫీస్ రూమ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడిన ఎమ్మెల్యే, వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీ వాసుల నుండి వచ్చిన సూచనలు, సమస్యలను సానుకూలంగా స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# లొంగిపోయిన 8 మంది మావోయిస్టులు



* **సత్ఫలితాలిస్తున్న ఆపరేషన్ చేయూత: ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 8 మంది దళ సభ్యులు లొంగిపోయినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమం సత్ఫలితాలనిస్తుందని పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో ఒకరు పీపీసీఎం స్థాయి కేడర్, ఒకరు పార్టీ మెంబర్, ఆరుగురు మిలీషియా సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖలు ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న పునరావాస చర్యల వల్ల మావోయిస్టు సభ్యుల్లో నమ్మకం పెరుగుతోందని వివరించారు. లొంగిపోయిన సభ్యులు ఇకపై నక్సలిజాన్ని విడనాడి కుటుంబాలతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయం తీసుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు ఆపరేషన్ చేయూత ద్వారా మొత్తం 314 మంది మావోయిస్టులు లొంగిపోయారన్నారు. డీవీసీఎం సభ్యులు నలుగురు, ఏసీఎం సభ్యులు 21 మంది, పార్టీ సభ్యులు 40, మిలీషియా సభ్యులు 116 మంది, ఆర్పీసీ సభ్యులు 35 మంది, డీఏకెఎంఎస్ సభ్యులు 47 మంది, సీఎన్ఎం సభ్యులు 30 మంది, జీఆర్డీ సభ్యులు 21 మంది ఉన్నారని వివరించారు. మంగళవారం లొంగిపోయిన 8 మందికి తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికి రూ.25 వేల చొప్పున, మొత్తం రూ.2 లక్షలు నగదు అందజేశామని, ర్యాంకుల ఆధారంగా మిగిలిన నగదు పునరావాస ప్యాకేజీని ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలు పూర్తయిన తర్వాత చెక్కుల రూపంలో వారి ఖాతాల్లో జమ చేస్తామని వివరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ కలిసి పలు చర్యలు తీసుకుంటున్నాయని, రహదారులు, పాఠశాలలు, వైద్యశాలలు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాలు నాణ్యమైన విద్య, వైద్య సౌకర్యాల కల్పన, ఆధివాసీ సంక్షేమ పథకాలు వంటి కార్యక్రమాలు అమలులో ఉన్నాయని జిల్లా ఎస్పీ వివరించారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 05 మంది, తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద 81 మంది మావోయిస్టు పార్టీలో సభ్యులుగా ఉన్నారని, వారంతా కూడా మావోయిజాన్ని విడనాడి తమ కుటుంబాలతో కలిసి శాంతియుత జీవితం గడపాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## వైష్ణవి టెక్నో స్కూల్ లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురికాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివ పార్వతులు, వినాయకుడి వేషధారణలతో అలరింపజేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన వేడుకలలో వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగల ప్రాముఖ్యతను, వినాయక చవితి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు మరిచిపోకుండ ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాదేదీ కళకు అనర్హం.. వ్యర్థాలతో అద్భుత కళాకృతులు!



ఇనుప, ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత టైర్లతో ఒడిశాకు చెందిన శిల్పి ప్రియరంజన్ బరాల్ బృందం అద్భుత కళాకృతులు సృష్టించి భళా అనిపిస్తోంది. రాజధాని భువనేశ్వర్‌లోని ఆయా ప్రాంతాల్లో కొలువుదీరిన వారి కళాఖండాలతో ఆ నగరం.. ఓ బహిరంగ కళాప్రదర్శనశాలగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. 2015లో డెంగీపై అవగాహన కల్పిస్తూ తయారు చేసిన శిల్పంతో బరాల్ వెలుగులోకి వచ్చారు. ఈ క్రమంలోనే కొవిడ్ సమయంలో బహిరంగ ప్రదేశాలను ఆకర్షణీయంగా మార్చేందుకు భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో ఆయనతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రియరంజన్ బరాల్ బృందంలో దాదాపు 20 మంది యువ కళాకారులు ఉన్నారు. వీరు తుక్కు దుకాణాలు, గ్యారేజీల నుంచి అవసరమైన వ్యర్థాలను సేకరిస్తారు. ఒకటి, రెండు నెలల్లో వాటిని కళాకృతులుగా మలుస్తారు. ఇందులో ఒక్కొక్కటి రూ.5 లక్షల నుంచి రూ.11 లక్షల విలువ చేస్తుంటాయి. ఒడిశా సంస్కృతిని ప్రతిబింబించడంతోపాటు సామాజిక అవగాహనను పెంపొందించేలా వీటిని తయారు చేస్తుండటం ప్రత్యేకత. ఒడిశాకు చెందిన ప్రముఖ సంగీత కళాకారుడు అక్షయ్ మహంతి, కోణార్క్ చక్రం వంటి నమూనాలకు వీరు రూపం పోశారు.

## బిహార్ 'ఓట్ల చోరీ' విమర్శలు.. ప్రజాభిప్రాయం కోరనున్న ఈసీ

కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కారు ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బిహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బిహార్ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ ఐదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అవి

* ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా?
* చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా?
* రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా?
* ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా?
* విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజల ఓటు హక్కును తిరస్కరించాలా?

ఈ ప్రశ్నల ఆధారంగా బిహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



## మట్టి విగ్రహాలను పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి

* **చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకటరాంరెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకటరాంరెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో సుధా పిల్లల, దంత వైద్యశాల డాక్టర్ అవ్వారి శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ అవ్వారి నీరజ దేవిల సౌజన్యంతో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకటరాంరెడ్డి చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో గత 9సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మట్టి వినాయకుడిని పూజించండి.. పర్యావరణ పరిరక్షణకు పాటుపడండి అంటూ పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారుచేసిన వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి వందల సంవత్సరాలు పడుతుందని, అదేవిధంగా భూమ్మీద జీవరాశులకు అనేక రోగాలకు కారణ ము అవుతుందన్నారు. అటువంటి విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసినప్పుడు, విగ్రహానికి ఉన్న రంగులు నీటిలో కరగడం వల్ల అనేక జలచర జీవులు మరణిస్తాయన్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి చెరువులు నిమజ్జనం చేయడం వల్ల చెరువుల్లో మట్టి సాంద్రత పెరుగుతుందని చెరువు, నీటిని, జలచరాలను కాపాడిన వాళ్ళం అవుతామన్నారు. మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ అధ్యక్షుడు తిరందాస్ జగన్నాథ్, కార్యదర్శి ఎండి హతహర్ పాషా, కోశాధికారి సిలివేరు మంగయ్య, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పోలోజు శ్రీనివాస చారి, జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్, నాంపల్లి రమేష్, కొసనం రాంరెడ్డి, కాసుల వెంకటేశం, బొబ్బిళ్ళ మురళి, కామిశెట్టి చంద్రశేఖర్, కామిశెట్టి భాస్కర్, వేముల నరసింహ, వనం రాజు, సురోజు సత్యనారాయణ చారి, చింతల ప్రభాకర్ రెడ్డి, దేప అనిల్, పోలోజు రాజు చారి, దాచేపల్లి శ్రీను, సంపూర్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలం

* **కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : రేవంత్ రెడ్డి మాటలకే పరిమితమై ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో పూర్తిగా విఫలమయ్యారని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావు అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితమైన మట్టి విగ్రహాల పంపిణీకి గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. ప్రతి డివిజన్‌కు కనీసం 1000 నుండి 2000 వరకు మట్టి వినాయక విగ్రహాలు అందజేయడం ద్వారా ప్రజలలో పర్యావరణ అవగాహన పెంపొందించారన్నారు. మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మంచి సంప్రదాయాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. స్వయానా ముఖ్యమంత్రి , మున్సిపల్ శాఖ మంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం పరిపాలనా వైఫల్యం కారణంగా ఈసారి ప్రతి డివిజన్‌కు కేవలం 200 విగ్రహాలకే పరిమితం చేశారని ఇది ప్రజల ఆత్మీయ విశ్వాసాలను అవమానపరచడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలకు పెద్ద దెబ్బతీసిందన్నారు. ప్రజలకు లభించాల్సిన సౌకర్యాలను కత్తిరించడం పర్యావరణహిత కార్యక్రమాలను అణగదొక్కడం ప్రస్తుత ప్రభుత్వ తీరును బహిర్గతం చేస్తోందన్నారు. ప్రజా ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తున్న ఈ ప్రభుత్వ వైఖరిని ప్రజలు తప్పకుండా గమనిస్తున్నారని అన్నారు.

## త్రినిటీలో వినాయక చవితి సంబరాలు





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రం త్రినిటీ పాఠశాలలో ముందస్తుగా వినాయక చవితి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వినాయకుని ఆకారంలో కూర్చొని, వినాయకుని ప్రతిరూపం ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిష్ఠించి, ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యార్థులకు వినాయక పండుగ ప్రాస్త్యత్యాన్ని వివరించారు. అదేవిధంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. వినాయక పండుగ ప్రకృతితో మమేకమైందని, వినాయక పత్రిలో వివిధ రకాలైన మొక్కలను వాడతారన్నారు. పర్యావరణ సహితంగా వినాయక పండుగ జరుపుకోవాలని, ప్లాస్టిక్ ను నిషేధించి జ్యూట్ బ్యాగులని వాడాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కే వి బి కృష్ణారావు, ఉపాధ్యాయులు అనూష, చందన, జ్యోతి, రత్న, భార్గవి, సింధు, శిరీష, అనసూయ, లావణ్య, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలపై మోపిన అధిక ఆస్తిపన్ను, పెనాల్టీలను మాఫీ చేయాలి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : పేద ప్రజలపై పెనాల్టీల రూపంలో అధిక ఆస్తి పన్ను భారాన్ని మోపడం అన్యాయమని, అధిక ఆస్తిపన్ను ,పెనాల్టీలను మాఫీ చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ , గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లను కలుసుకుని, పేద ప్రజలపై అధిక ఆస్తిపన్ను రూపంలో ఆర్థిక భారాన్ని మోపవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జంట సర్కిళ్ల పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ వంటి బస్తీలు, స్లమ్ములు, 60 గజాల గృహవాసాలు ఉన్న పేదవారు నివసించే ప్రాంతాల్లో గత మూడు సంవత్సరాల ఆస్తిపన్ను వసూళ్లు , విధించిన పెనాల్టీలను రద్దు చేయాలని అధికారులను కోరారు. ఎన్‌టిఆర్ నగర్ వంటి కాలనీల్లో ఇళ్లు చాలాకాలం క్రితమే నిర్మించబడ్డాయని, ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వారు పేద ప్రజలని ఆయన గుర్తుచేశారు. ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌లను ఎమ్మెల్యే కోరారు. ఈ సమస్యపై న్యాయం జరిగేలా జీ.హెచ్.ఎం.సి కమిషనర్ కర్ణన్ తో ఫోన్ ద్వారా మాట్లాడి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు కొలుకుల జగన్, విజయ్ శేఖర్ గౌడ్, మంత్రి సత్యనారాయణ, సీనియర్ నాయకులు మహమ్మద్ రఫీక్, మన్నే రాజు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, మన్నే బాలేష్, సత్తి రెడ్డి, సిద్ధికి, గుబ్బాల లక్ష్మీనారాయణ, ఎన్‌టిఆర్ నగర్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మన్నే మహేష్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అనుచరుడు మన్నే మహేష్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కె ఎస్ ఆర్ శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'పేపర్' గణేశా.. పర్యావరణ హితేశా!

గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల నడుమ చేసుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే విగ్రహ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే గుజరాత్‌లోని సూరత్‌లో ఏర్పాటు చేసిన ఓ వినాయక విగ్రహం అందరినీ ఆకట్టుకుంటోంది. కారణం.. దాని తయారీలో వందల కిలోల టిష్యూ పేపర్‌ను వినియోగించడమే. సర్కార్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిమ.. గుజరాత్‌లోనే అతిపెద్ద పర్యావరణహిత విగ్రహంగా నిలిచింది. దాదాపు 16 అడుగుల ఎత్తు, ఆరు అడుగుల వెడల్పుతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఆకృతి మొదలుకుని ఆభరణాల వరకు కచ్చితత్వంతో నెలరోజుల్లో దీన్ని తయారు చేశారు. దీని కోసం ముంబయి నుంచి 15 మంది కళాకారులను రప్పించారు. దీని తయారీలో 350 కిలోల టిష్యూ పేపర్‌ను ఉపయోగించారు. విగ్రహం నిమజ్జనానికి సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో ప్రత్యేక కొలను సైతం నిర్మించారు. నిమజ్జనం అనంతరం మిగిలిన కాగితపు గుజ్జును కంపోస్ట్ ఎరువు తయారీలో ఉపయోగించవచ్చని నిర్వాహకులు చెబుతున్నారు.

# దొంగ ఓట్లంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం.. ప్రజల్ని అవమానించడమే: బండి



కరీంనగర్: ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ''దొంగ ఓట్లు అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు వేయడం ఎవరికైనా సాధ్యమా? అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రోహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు బ్యాంకు ముఖ్యమా? అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయి'' అని బండి సంజయ్ విమర్శించారు.

## ఖైరతాబాద్ గణపతి.. సెల్ఫీలతో భక్తుల సందడి

హైదరాబాద్: విశ్వశాంతి మహాశక్తి గణపతి రూపంలో పూజలు అందుకోవడానికి ఖైరతాబాద్ వినాయకుడు సిద్ధమయ్యాడు. బుధవారం వినాయక చవితి ఉత్సవాలు మొదలుకానుండగా.. మంగళవారమే భక్తులకు మహాగణపతి దర్శనమిస్తున్నాడు. దీంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడుతోంది. కొందరు భక్తులు బడా గణేశ్ వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



## దేశంలో ఎక్కడా లేని భూసమస్యలు తెలంగాణలోనే: హైకోర్టు

హైదరాబాద్: రంగారెడ్డిజిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ మంగళవారం విచారణ జరిగింది. నాగారంలోని సర్వే నెంబర్ 194, 195లో 754 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వ న్యాయవాది మురళీధర్ రెడ్డి హైకోర్టుకు తెలిపారు. ఇందులో కేవలం 95 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి అని, మిగతాది పట్టా భూమి అని చెప్పారు. సర్వే నెంబర్ 194లో 383 ఎకరాలు, సర్వే నెంబర్ 195లో 370 ఎకరాల భూమి ఉందన్నారు. 2012 జూన్ వరకు ఈ భూమి పట్టా భూమిగానే ఉన్నప్పటికీ పొరపాటున నిషేధిత జాబితాలో చేర్చారని, ఆ తర్వాత సరిదిద్దడంతో భూయజమానుల పేరు మీద పట్టాలు వచ్చాయని కోర్టుకు తెలిపారు. 95 ఎకరాల నిషేధిత భూమిలో మాత్రం ఎలాంటి లావాదేవీలు జరగడంలేదన్నారు. నాగారంలో 700 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, 2019 వరకు నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ 2018లోనే వీటికి పట్టాలిచ్చారని మహేశ్వరం మండలం



అమీర్‌పేటకు చెందిన మహేశ్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు పట్టాలెలా ఇచ్చారో సమాధానం చెప్పాలని రెవెన్యూ శాఖకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాల్లో ఏమాత్రం వాస్తవం లేదని, అవి పట్టా భూములేనని మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాత్రమే ప్రభుత్వ భూముల సమస్య ఉందని జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. అధికారులు చెబుతున్న వివరాలకు, వాస్తవాలకు పొంతనలేదని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. రెండేళ్ల వయసున్న వాళ్ల పేరుమీద పట్టా భూమి ఉన్నట్లు వివరాలున్నాయని చెప్పారు. దీంతో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసి.. విచారణను వాయిదా వేసింది.

## హైకోర్టు తీర్పుతో 9లక్షలకుపైగా సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: సాదాబైనామాల అంశంపై హైకోర్టు స్టే తొలగించడంతో ఆ దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమమైందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూభారతి చట్టం.. సాదాబైనామాల పరిష్కారానికి దారి చూపిందని, త్వరలో 9 లక్షలకు పైగా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని అన్నారు. హైకోర్టు తీర్పు లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తుందని అభిప్రాయపడ్డారు. సాదాబైనామాల విషయంలో గత ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.. కానీ, పరిష్కారం చూపలేదన్నారు. ఫలితంగా



9.26లక్షల దరఖాస్తులు పరిష్కారం కాకుండా నిలిచిపోయాయని, కొందరు హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారానికి ఇప్పటికే గ్రౌండ్ వర్క్ పూర్తి చేసినట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

## లక్ష్మీ ప్రసన్న అనుమానాస్పద మృతి.. భర్త సహా ముగ్గురి అరెస్ట్

అశ్వారావుపేట గ్రామీణం: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ముచ్చవరం పంచాయతీ పరిధిలోని విశ్వన్నాథంపురానికి చెందిన లక్ష్మీప్రసన్న(33) అనుమానాస్పద మృతి కేసులో నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ నాగరాజు తెలిపారు. మృతురాలి భర్త నరేష్, తల్లి విజయలక్ష్మి, సోదరి భూలక్ష్మిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. మరో నిందితుడు శ్రీనివాసరావు పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. విశ్వన్నాథంపురానికి చెందిన లక్ష్మీప్రసన్న(33) ను అదే మండలం ఖాన్‌ఖాన్‌పేట వాసి పూల నరేశ్‌బాబుకు ఇచ్చి 2015లో వివాహం జరిపించారు. తొమ్మిదేళ్ల క్రితం వారికి కుమార్తె పుట్టింది. తరువాత నరేశ్‌బాబు ఆరేళ్లపాటు భార్యతో కలిసి అత్తగారింట్లోనే ఉన్నాడు. మూడేళ్ల తర్వాత భార్యాబిడ్డలతో కలిసి అశ్వారావుపేటకు వచ్చి అక్కాబావల ఇంట్లో ఉంటున్నారు.



శనివారం నరేశ్‌బాబు అత్తామామలకు ఫోన్ చేసి.. లక్ష్మీప్రసన్న ఇంట్లో మెట్ల పైనుంచి కిందపడటంతో గాయాలయ్యాయని, దగ్గర్లోని రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చేర్పించామని చెప్పాడు. దీంతో వారు ఆసుపత్రికి వెళ్లి చూడగా అప్పటికే లక్ష్మీప్రసన్న మృతిచెంది ఉంది. ఎముకల గూడులా మారిన ఆమెను కాసేపు గుర్తుపట్టలేకపోయారు. శరీరమంతా కొత్త గాయాలు, మానిన గాయాల గుర్తులు ఉండటం చూసి తల్లడిల్లిపోయారు. లక్ష్మీప్రసన్నను అదనపు కట్నం కోసం నరేశ్‌బాబు, అతని తల్లి విజయలక్ష్మి, అక్క దాసరి భూలక్ష్మి, బావ శ్రీనివాసరావు హింసించేవారని ఆరోపించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సాహితీ ఇన్‌ఫ్రా కేసు..
## సందు పూర్ణచందర్‌రావును అరెస్ట్ చేసిన ఈడీ




హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా కేసులో సంస్థ మాజీ డైరెక్టర్ సందు పూర్ణచందర్‌రావును ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వినియోగదారుల నుంచి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసినట్టు సాహితీ ఇన్‌ఫ్రా సంస్థపై ఆరోపణలున్నాయి. ప్రజల నుంచి సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ రూ.800 కోట్లు వసూలు చేసినట్టు అభియోగం. గతంలోనే ఆ సంస్థ ఎండీ లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. పూర్ణచందర్‌రావు పాత్ర ఉన్నట్టు దర్యాప్తులో తేలడంతో ఇవాళ అధికారులు అరెస్టు చేశారు. ప్రజల డబ్బు సొంత ఖాతాలకు మళ్లించి కుటుంబ సభ్యుల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్టు ఈడీ గుర్తించింది. ఈ కుంభకోణంపై వివిధ పోలీస్ స్టేషన్లలో కూడా కేసులు నమోదయ్యాయి. వాటి ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా

హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని భాజపా ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మా పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్తాం.. దానికి మీరు కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై రఘునందన్‌రావు ఘాటుగా స్పందించారు. ''పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. ఓటు చోరీ చేస్తే దేశంలో ఉన్న అన్ని పార్లమెంట్ స్థానాల్లో మేమే గెలుస్తాం కదా. మీరెందుకు 8 ఎంపీ స్థానాలు



గెలుస్తారు? అసదుద్దీన్ ఎలా గెలుస్తారు. దమ్ముంటే మీ 8 మంది ఎంపీలతో రాజీనామా చేయించండి. మేమూ రాజీనామా చేస్తాం. కొత్త ఓటర్ లిస్ట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్దాం. అప్పుడు వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుస్తాయి. భాజపాను అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా? కుంటి సాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. కాళేశ్వరంపై నిజాయితీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వచ్చింది?'' అని రఘునందన్‌రావు ప్రశ్నించారు.

## సాదాబైనామాల క్రమబద్ధీకరణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్: తెలంగాణలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అడ్డంకి తొలగింది. 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10 వరకు స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతించింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 2020 అక్టోబరు 10న రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవోపై 2020 నవంబరులో ఉన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. చట్టంలో అవకాశం లేకుండా ఎలా క్రమబద్ధీకరిస్తారని ప్రశ్నించింది. కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ అంశం పొందుపరిచినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.



ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిన ధర్మాసనం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అంగీకరిస్తూ కేసు విచారణను ముగించింది.

## ప్రియుడి మోజులో పడి
## భర్తను కడతేర్చిన భార్య.. కుమారుడి ఫిర్యాదుతో వెలుగులోకి..

నిర్మల్: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఓ భార్య కట్టుకున్న భర్తను కడతేర్చింది. ఆపై మూర్ఛతో మృతి చెందాడని అందరినీ నమ్మించింది. కుమారుడు అనుమానం వ్యక్తం చేయడంతో హత్య విషయం బయటపడింది. ఈ ఘటన నిర్మల్ జిల్లా సోన్ మండలం వెల్మల్ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిచరణ్ (50), నాగలక్ష్మీ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నాగలక్ష్మికి మహేశ్ అనే వ్యక్తితో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. వారిద్దరికీ భర్త అడ్డుగా ఉన్నాడని భర్తను అడ్డు తొలగించాలనుకుంది. మంగళవారం మహేశ్‌ను ఇంటికి పిలిపించి హరిచరణ్‌ను బంధించి దిండుతో ఊపిరి ఆడకుండా చేసి ఇద్దరు కలిసి హత్య చేశారు. అనంతరం బాత్రూమ్‌లో మూర్ఛ వచ్చి చనిపోయారని చుట్టుపక్కల వారిని బంధువులను నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేశారు. మూడు రోజుల తర్వాత కుమారుడు గల్ఫ్ దేశం నుంచి వచ్చి తాను రాకముందే తండ్రి అంత్యక్రియలు చేయడంపై అనుమానం వ్యక్తం చేశాడు. తల్లి తీరు అనుమానాస్పదంగా ఉండటంతో సోన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. సోన్ సీఐ, ఎస్సై విచారణ చేపట్టి, హత్య జరిగినట్లు భావించి నాగలక్ష్మిని, మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికలు..
## సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితా

హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 28న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈనెల 29న జిల్లా స్థాయి, 30న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈనెల 28 నుంచి 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాను విడుదల ప్రకటిస్తామని ఎన్నికల సంఘం పేర్కొంది.

## అత్యాచారం కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు



నల్గొండ: బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి 50 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై 2021లో తిప్పర్తి పీఎస్‌లో మహ్మద్ ఖయ్యూమ్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. 2022 నుంచి జిల్లా కోర్టులో వాదనలు కొనసాగగా.. తాజాగా తీర్పు వెల్లడైంది.

# వెంకటేశ్‌తో మరో సినిమాకు వివి వినాయక్ యత్నం



**టాకీస్:** టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్, తన తదుపరి సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వచ్చిన విజయాన్ని కొనసాగించాలని భావిస్తున్న వెంకీ, ఎంతో ఆలోచించి తన తదుపరి ప్రాజెక్ట్‌ను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేస్తున్నాడు. వెంకటేష్ - త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొంద బోతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబ ర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ చేస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇకపోతే త్రివిక్రమ్ సినిమా మాత్రమే కాకుండా, వెంకటేష్ ప్రస్తుతం ఇతర దర్శకులతో కూడా చర్చలు జరుపు తున్నారు. కొత్త కథలు వింటూ, తదుపరి ప్రాజెక్టుల కోసం పునరాలోచన చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతోంది. గతంలో వెంకటేష్‌తో 'లక్ష్మి' అనే బ్లాక్‌బస్టర్ సినిమాను తెరకెక్కించిన వి.వి. వినాయక్, మళ్లీ వెంకీ కోసం ఓ మాస్ ఎంటర్‌టైనర్ స్క్రిప్ట్ రాయిస్తున్నట్లు- సమాచారం. త్వరలోనే ఆయన వెంకటేష్‌ను కలవాలని, కథ చెప్పాలని చూస్తున్నట్లు- ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. 2006లో వచ్చిన 'లక్ష్మి' చిత్రం వెంకటేష్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచింది. అప్పట్లో వీరిద్దరి కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుందని వార్తలు వచ్చినా, ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. ఇప్పుడు 19 ఏళ్ల గ్యాప్ తర్వాత, మళ్లీ అదే కాంబినేషన్ తెరపైకి వస్తుందన్న వార్తలు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. పైగా ఇది కూడా మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్‌లో ఉండనున్నట్టు- సమాచారం. 'ఇంటెలిజెంట్' వంటి సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన తర్వాత వినాయక్ కొంతకాలం గ్యాప్ తీసుకున్నారు. హిందీలో 'ఛత్రపతి' రీమేక్ చేసినా, అది కూడా మిశ్రమ స్పందనే పొందింది. దాంతో కాస్త గ్యాప్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వెంకటేష్‌తో కాంబినేషన్ కుదిరితే, వినాయక్ తిరిగి హిట్ ట్రాక్‌లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# జీ స్టూడియోకు చిరు చిత్రం డిజిటల్ రైట్స్



టాకీస్: అనిల్ రావిపూడి చివరిగా చేసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏకంగా 300 కోట్లు- కలెక్ట్ చేసి, ఫ్యామిలీ సినిమా సత్తా ఏంటో చాటింది. నామ్ థియేటర్ హక్కులను జీ స్టూడియోస్ సంస్థ భారీగానే దక్కించుకొని, గట్టిగానే లాభపడింది. ఇక ఇప్పుడు చిరంజీవి-అనిల్ రావిపూడి సినిమా విషయంలో కూడా హక్కులు జీ స్టూడియోస్ దక్కించుకున్నట్టు- తెలుస్తోంది. ఈ సినిమాకు మన శంకర వరప్రసాద్ గారు పండగకి వస్తున్నారు అనే టైటిల్‌ను అనిల్ రావిపూడి ఫిక్స్ చేశాడు. జీ స్టూడియోస్ సంస్థ డిజిటల్ రైట్స్‌తో పాటు- శాటిలైట్ రైట్స్‌ను కూడా ఫ్యాన్సీ ప్రైస్‌కి దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు- సమాచారం. దాదాపుగా డీల్ క్లోజ్ అయినట్లేనని, చిరంజీవి-అనిల్ రావిపూడి కెరీర్‌లోనే అత్యధిక డబ్బులు రాబట్టిన ఓటీటీ- డీల్‌గా ఇది నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, జీ స్టూడియోస్ సంస్థ ఈ సినిమాకు సంబంధించిన హిందీ డిజిటల్ రైట్స్‌ను అమెజాన్ ప్రైమ్‌కు అమ్మేసింది. అయితే, సౌత్ శాటిలైట్, డిజిటల్ రైట్స్‌ను మాత్రం తన దగ్గరే ఉంచుకుంది. నిజానికి, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సంస్థలు ఈ సినిమా రైట్స్ దక్కించుకునే ప్రయత్నం చేశాయి. అయితే, అనిల్ రావిపూడితో ప్రస్తుతం షోస్ కూడా చేస్తున్న జీ స్టూడియోస్ సంస్థ ఫైనల్‌గా డీల్ క్రాక్ చేసింది. ఇప్పటికే ఇండస్ట్రీ సమ్మె పూర్తికావడంతో, సెప్టెంబర్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి బరిలోకి దించబోతున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు బీమ్స్ సంగీతం అందిస్తున్నాడు.

# మిరాయ్ సినిమా మరో వారం వాయిదా

**టాకీస్:** హనుమాన్ సినిమాతో ఫ్యాన్ ఇండియా క్రేజ్ సంపాదించుకున్న తేజా, ఇప్పుడు మిరాయ్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విశ్వప్రసాద్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజానికి, ఈ సినిమా సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది, కానీ ఈ సినిమా ఒక వారం వాయిదా పడే అవకాశం ఉందని అంటున్నారు. ఇంకా అధికారిక సమాచారం రాలేదు, కానీ సెప్టెంబర్ 12వ తేదీన సినిమా రిలీజ్ చేయబోతున్నారు. ఈ విషయాన్ని 28వ తేదీన రిలీజ్ చేయబోతున్న ట్రైలర్‌తో పాటు- ప్రకటించనున్నారు. ఈ సినిమా పూర్తిగా కంప్యూటర్ గ్రాఫిక్స్ బేస్డ్ సినిమా. సినిమాలో సింహభాగం కంప్యూటర్ గ్రాఫిక్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఈ సినిమా కంప్యూటర్ గ్రాఫిక్స్ అవుట్‌పుట్ సెప్టెంబర్ 1వ తేదీ నాటికి రెడీ అవుతుందని అంచనా వేసినప్పటికీ, ఒకవేళ వాటిలో ఏమైనా కరెక్షన్స్ చేయాల్సి వస్తే, అప్పటికప్పుడు చేసి 5వ తేదీ లోపు రిలీజ్ చేయడం కష్టం కాబట్టి, కాస్త సమయం తీసుకునేందుకు సెప్టెంబర్ 12వ తేదీన ఫిక్స్ చేసుకున్నట్లు సమాచారం.





తొలి సినిమాతోనే కుర్రాళ్ల గుండెల్లో స్థానం సంపాదించుకున్న కుర్ర భామ

టాకీస్: పాయల్ రాజ్ పుత్.. ఈ ముద్దుగుమ్మ తెలుగులో మొత్తం 12 సినిమాల్లో నటిస్తే కేవలం రెండు మాత్రమే హిట్టయ్యాయి. అయినా కూడా క్రేజ్ మాత్రం విపరీతంగా సొంతం చేసుకుంది. యంగ్ హీరో కార్తికేయ సరసన ఆర్‌ఎక్స్ 100 మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది.తొలి సినిమాతోనే కుర్రాళ్ల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన ఈ సినిమా భారీ వసూళ్లు రాబట్టింది. పాయల్ రాజ్ పుత్.. ఈ ముద్దుగుమ్మ తెలుగులో మొత్తం 12 సినిమాల్లో నటిస్తే కేవలం రెండు మాత్రమే హిట్టయ్యాయి. అయినా కూడా క్రేజ్ మాత్రం విపరీతంగా సొంతం చేసుకుంది. యంగ్ హీరో కార్తికేయ సరసన ఆర్‌ఎక్స్ 100 మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది. తొలి సినిమాతోనే కుర్రాళ్ల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. అజయ్ భూపతి దర్శకత్వం

## తొలి సినిమాతోనే కుర్రాళ్ల గుండెల్లో స్థానం సంపాదించుకున్న

# కుర్ర భామ

వహించిన ఈ సినిమా భారీ వసూళ్లు రాబట్టింది. అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసిన ఈ వయ్యారి.. తొలి చిత్రంలో ఓ రేంజ్ రొమాంటిక్ సన్నివేశాల్లో కనిపించింది ఈ వయ్యారి భామ. ఫస్ట్ మూవీ హిట్టైనా ఆ తర్వాత మాత్రం వరుసగా నిరాశపరిచాయి.ఎన్టీఆర్: కథానాయకుడు, లవ్, వెంకీమామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, తీస్ మార్ ఖాన్, మాయపేటిక, మంగళవారం వంటి చిత్రాల్లో నటించింది. నటనపరంగా ఈ ముద్దుగుమ్మకు మంచి మార్కులు పడ్డా కూడా హిట్స్ మాత్రం రాలేదు. వరుసగా సినిమాలు చేసినా కూడా..ఆర్‌ఎక్స్ 100, మంగళవారం సినిమాలు తప్ప మిగిలినవేవి హిట్ కాలేదు. తెలుగుతోపాటు కన్నడ, పంజాబీలో పలు చిత్రాల్లో నటించింది. కానీ అక్కడ సైతం నిరాశే ఎదురైంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ వైరలవుతున్నాయి. క్యూట్ స్టైల్ తో క్రేజీ ఫోజులిచ్చింది పాయల్. ఈ ఫోటోలకు కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాలు లేకపోయినా పాయల్ సోషల్ మీడియాలో అభిమానులకు ఎప్పుడూ టచ్ లో ఉంటుంది. ఈ చిన్నదానికి నుంచి సాలిడ్ హిట్ కోసం చూస్తున్నారు ఫ్యాన్స్.

# ఒకే పార్ట్‌గా రెండు భాగాలు..

## 'బాహుబలి: ది ఎపిక్' టీజర్ రిలీజ్




టాకీస్: తెలుగు సినిమాను ప్రపంచానికి పరిచయం చేసిన ఐకానిక్ బ్లాక్ బస్టర్ 'బాహుబలి' సినిమాను మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్న విషయం తెలిసిందే. (బాహుబలి: ది ఎపిక్) పేరుతో రెండు భాగాలను ఒకే పార్ట్‌గా అక్టోబర్ 31, 2025న ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. అయితే ఈ తాజాగా ఈ మూవీ రీ రిలీజ్ వెర్షన్‌కి సంబంధించిన టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రీమాస్టర్డ్, రీ ఎడిట్ వెర్షన్‌తో రాబోతున్న ఈ టీజర్ ప్రస్తుతం గూస్‌బంప్స్‌ని తెప్పిస్తుంది. దిగ్గజ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించగా.. అనుష్క, తమన్నా కథానాయికలుగా, దగ్గుబాటి రానా ప్రతినాయకుడి పాత్రలో, రమ్యకృష్ణ, కట్టప్పగా సత్యరాజ్ తదితర పాత్రల్లో అలరించారు. ఎంఎం కీరవాణి సంగీతం, శోభు యార్లగడ్డ నిర్మాణం ఈ సినిమాకు హైలెట్‌గా నిలిచాయి.

# యధావిధిగా 5న విడుదలవుతున్న ఘాటి

**టాకీస్:** క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క, విక్రమ్ ప్రభు కీలక పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ డ్రామా 'ఘాటీ-'. సెప్టెంబరు 5న ఈ మూవీ విడుదల కానుంది. ఇదే రోజున రావాల్సిన 'మిరాయ్' వాయిదా పడటం అనుష్క సినిమాకు కలిసొచ్చే అంశం. ఎక్కువ థియేటర్లు దొరికే అవకాశం ఉంది. అదే సమయంలో తమిళం నుంచి వస్తున్న శివకార్తికేయన్ 'మదరాశి' పైనా మంచి అంచనాలే ఉన్నాయి. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రస్తుతం ఈ సినిమాలకే కాదు, దసరా కానుకగా రాబోతున్న చిత్రాల పైనా సమ్మె ప్రభావం పడినట్లు- తెలుస్తోంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడి సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీని సెప్టెంబరు 25న విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీ-వల ఈ సినిమా విడుదల తేదీ విషయంలో కాస్త గందరగోళం నెలకొంది. ఇంకో నాలుగైదు రోజుల షూటింగ్, అది కూడా ప్యాచ్ వర్క్ మిగిలిఉందని టాక్ వినిపించింది. ఈక్రమంలో సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందన్నారు. కానీ, 'సువ్వి.. సువ్వి' సాంగ్ ప్రకటిస్తూ విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇంకా నెల రోజులే సమయం ఉండటంతో వీలైనంత త్వరగా ప్రమోషన్స్ మొదలు పెట్టాలని పవన్ అభిమానులు కోరుతున్నారు.



# చిత్ర నిర్మాణ రంగంలోకి జయం రవి

## రవిమోహన్ స్టూడియోస్ నిర్మాణ సంస్థకు శ్రీకారం



టాకీస్: ఒకవైపు మాజీ భార్య ఆర్తితో విడాకుల వివాదంతో వార్తల్లో నిలుస్తునే.. మరోవైపు తన కెరీర్‌లో కీలక ముందడుగు వేశాడు నటుడు జయం రవి (రవి మోహన్). తాజాగా ఈ నటుడు 'రవిమోహన్ స్టూడియోస్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించాడు. చెన్నైలో ఈ వేడుక ఘనంగా జరుగగా.. ఈ ఈవెంట్‌కి రవి తన ప్రేయాసి కెన్నిషాతో కలిసి వచ్చి ఘనంగా ప్రారంభించారు. ఇక ఈ వేడుకకు.. ముఖ్య అతిథులుగా కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, తమిళ హీరోలు కార్తీతో పాటు-, శివకార్తికేయన్ సూర్య, అథర్వ, జెనీలియా, రితేష్ దేశ్‌ముఖ్, దర్శకురాలు సుధా కొంగరతో పాటు- పలువురు స్టార్ సెలబ్రీటిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి మోహన్ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మించబోయే తొలి రెండు సినిమాలను కూడా ప్రకటించారు. అందులో మొదటి సినిమాలో రవి మోహన్ హీరోగా కార్తీక్ యోగి దర్శకత్వంలో తెరకెక్కబోతుంది. సూర్య ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నాడు. ఇక రెండవ సినిమాలో హాస్య నటుడు యోగిబాబు లీడ్ లో రాబోతోంది. ఈ సినిమాను స్వయంగా రవి మోహన్ దర్శకత్వం వహించబోతున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.